# 6. చెలఁది పురుగు శివైక్యము బొందుట

***– ధూర్జటి***

*మహాకవి ధూర్జటి రచించిన శ్రీ కాళహస్తి మాహాత్మ్యము ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడినది. ఈతని తల్లి పేరు సింగమ, తండ్రి నారాయణుడు16వ శతాబ్దికి చెందిన శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానములో అష్ట దిగ్గజకవులలో ధూర్జటి ఒకడు. "స్తుతిమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేలగల్గెనో యతులిత మాధురీ మహిమ............."అని ఇతని కవిత్వము రాయలవారిచే ప్రశంసింపబడినది.ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకమును కూడ రచించెను.*

*'శ్రీకాళహస్తి' స్థల పురాణమును తెలియజేయునది ఈ పాఠ్యభాగము. శ్రీ అనగా సాలెపురుగు. కాళమనగా పాము, హస్తి అనగా ఏనుగు. ఈ మూడు ప్రాణులు శివుని సేవించి శివసాయుజ్యమును పొందినవి. కనుకనే ఆ స్థలమునకు కాళహస్తి అను పేరు వచ్చినది. అందు సాలెపురుగు శివసాయుజ్యమును పొందుటను - ఈ పాఠ్యభాగమున వివరించబడినది. చెలది పురుగు పూర్వజన్మమున విశ్వకర్మ పుత్రుడగు ఊర్ణనాభుడు. అతడు బ్రహ్మదేవుని సృష్టికి ప్రతిసృష్టి చేసి బ్రహ్మదేవుని ఆగ్రహానికి గరియై చెలది పురుగుగా జన్మించెను. శాపగ్రస్తుడైన ఊర్ణనాభుడు పశ్చాత్తాప హృదయుడై వేడుకొనగా, శివదర్శనానంతరం శాపవిముక్తుడగునని బ్రహ్మ వాక్రుచ్చెను.*

*చ. కృతయుగవేళ మర్కటకీటక మొక్కటి పూర్వవాసనా
గతిమతి దేవ దేవు గరకంధరుఁ గొల్వఁ దలంచి, కుంభజ
క్షితిధరకన్యకాంబుపరిషిక్తశరీరముతోడ, నాత్మని
ర్గతబహుతంతుపంక్తి గలహాకల్పనశిల్పకళాప్రవీణతన్. 1

సీ. ప్రాకారములు, గోపురమ్ములు,కొలువుకూ
టములు, నర్తనమందిరములు, కోశ
గేహము, ల్పందిళ్ళు, కేళీనివాసంబు,
లంతఃప్రదక్షిణాయతనవీథి,
యుపహారభోగమంటపము, గర్భగృహంబు,
పరిణయ హైమ వైభవనిశాంత,
మంతఃపురంబు, కక్ష్యాంతరంబులు, జాల
కంబులు, మేడలు, గరుణ తోడ

గీ. నిభముఖానలజాతచండీశపుండ
రీకలోచనమాతృ కాలోకనయన
దక్షిణామూర్తివటుకాదిదైవతముల
నిలయములు గట్టె నతంతనిష్ఠతోడ, 2

*శా.ప్రాతఃకాలతుషారశీకరచయప్రాప్తిన్ లసన్మౌక్తికో
పేతాగారములట్లు చెల్వేసగి, తద్బిందుచ్ఛటాజాత ఖ
ద్యోతచ్ఛాయలఁ గొంతసేపు బహురత్నోదీర్ణ గేహంబులై
లూతాకల్పితతంతుసద్మములు వొల్చుం, జెప్పఁ జిత్రంబులై. 3

క. తీరుగ నీగతినిండులు
తీరఁగఁ గట్టియును, గాలిఁ ద్రెవ్విన పోఁగుల్
జాఱిన పోగులు నదుకం
దీరుపనేకాని, నిలువఁదీరక, దినమున్. 4

*శా. సేవింపంగఁ, జెలంది నేమముఁ బరీక్షింప న్లలాటాక్షు డా
త్మావాసంబున నున్న దీపశిఖికీలాభీలతీవ్రప్రభా
వ్యావిద్ధాంబరమై తగుల్కొని, తదీయాగారముల్ ధూమమై
పోవం జేసిన, రేఁగి కీటకము, హృద్భూత వ్యథాక్రోధమై. 5

క. “ఇది పెక్కేడులు పట్టెన్
సదనంబులు గట్ట నాకు శంభునికొఱకున్,
‘దుదిఁగుమ్మరి కొకయేఁడును,
గుదె కొకపె’ ట్టన్నమాటకు న్సరివచ్చెన్. 6

*చ. "కటకట! నేఁ బ్రయాసమునఁగట్టిన యిండ్లను గాల్చె దీప, మిం
తటఁబడి దీని మ్రింగక పృథీ వసియించినఁ గోప మాఱునే?
యటమటమైన జీవనమునందలి మోహము చాలు" నంచు ను
త్కటగతి దీపికానలశిఖావిసరంబులఁద్రావఁ బోవఁగన్.7

శా. దేవోత్తంసుఁడు భక్తవత్సలుడు, చిత్తేశస్వభావుండు, గౌ
రీవామాంగుఁడు, శంకరుండు దయ మూరింబోవఁ, గెంగేలునన్
జావన్వచ్చిన పుర్వుఁ బట్టి, "తగు నీసద్భక్తికి న్మెచ్చితిన్,
నీ వేయర్థము నన్ను వేడెదవు; దానిం జెప్పుమా !" నావుడున్ 8

క. చెలఁదియు, "నాతప మింతట
ఫలియించె" నటంచుఁ, బ్రమథపతికిఁ బ్రణామం
బులు పెక్కుసేసి,సంభ్రమ
కలితహృదయ మగుచు, భక్తి గడలుకొనంగన్. 9

*శా. "దేవా! నిన్ను నుతింపలే, నధమబుద్ధి వేద  శాస్త్రంబులున్
రా వేపాటియు, వచ్చినన్ 'శ్రుతులు శాస్త్రంబు ల్మిముం జెప్పఁగా
లే వాద్యంతము' లన్నఁ దద్విదులకున్ లెక్కింపఁగా శక్యమే?
సేవాధర్మము మేలుగా కనుచు, మీ శ్రీపాదము ల్గొల్చితిన్. 10

క. "నా కీ భవదుఃఖంబులు
లేక, మహాజ్ఞానరసవిలీనుఁడ నగుచున్,
లోకం బెన్నఁడు నెఱుఁగని
యా కైవల్యమె యభీష్ట" మని ప్రార్థింపన్. 11

చ. అనిమిషకోటి తా మహరహంబు నొనర్చు శివార్చన ల్మనం
బున నిరసింప,మౌనులు తపోవిభవంబులు రోయ, యోగవా
సనఁబడి పొర్లువారు తమజన్మముఁ దిట్టుకొనంగ, నన్యద
ర్శనరతులెల్ల "మా సమయసంగతి చాలు" నటంచు నెంచఁగన్. 12

*ఉ. ఎక్కడఁజూచిన న్సురమునీశ్వర దానవమానవాహిపుల్
మ్రొక్కుచు సన్నుతించురవముల్ ధ్రువమండలవీథి నిండఁగా
దిక్కులు ముంచుకొన్న తనతేజములోపల నూర్ణనాభమున్
గ్రక్కునఁ గూర్చెఁ దన్మయముగా శివలింగము భక్త లోలతన్. 13

క. లూతాధీశ్వరు కథ యిది,
వాతాశనహ స్తికథలు వా(కుత్తు, మహా
పాతకధా(త్రీధరని
ర్ఘాతములై యమృత మొల్కఁగా వీనులకున్. 14

**అర్థములు :**

మర్కట కీటకము = సాలెపురుగు; కుంభజ క్షితిధర కన్యకాంబు పరిషిక్త శరీరము = అగస్త్య పు(త్రికయగు సువర్ణముఖీ జలమున స్నానము చేసినదేహము; పుండరీకము = తెల్లతామర; తంతు పంక్తి = దారముల సమూహము; లలాటాక్షుడు = శివుడు; కోశగేహము = ధనాగారము; ఇభముఖుడు = వినాయకుడు, అనలజాతుడు = కుమారస్వామి; వటుకుడు = కాలభైరవుడు ; జాలకంబులు = కిటికీలు; తుషారశీకరచయము = మంచు బిందువుల గుంపు; లసన్మౌక్తికోపేతాగారములు = (ప్రకాశించుచున్న ముత్యాలతో కూడిన ఇండ్లు; లూతము = సాలెపురుగు; సద్మము = గృహము; ఆగారము = ఇల్లు; ఛటాజాత = కాంతినుండి పుట్టిన; ఖద్యోతచ్ఛాయలు = (మిణుగురు పురుగు) సూర్యుని కాంతులు; ఉదీర్ణ = వెదజల్లబడిన; నేమము = నియమము; దీపశిఖ = దీపముయొక్క అగ్ని; కీల = జ్వాల; వ్యాపిద్ధాంబరమై = చొచ్చుకొనబడిన ఆకాశం కలదై; సదనము = ఇల్లు; గుదె = కట్టె; అటమటము = వ్యాకులము; వాతాశన - పాము; వా(కుత్తు = చెప్పెదను; అనలశిఖా విసరంబులు = అగ్ని జ్వాలల సమూహము; భవదుఃఖంబులు = సంసారములోని దుఃఖములు; వీనులు = చెవులు; అహరహము = (ప్రతిదినము; కైవల్యము = మోక్షము; అనిమిషులు = దేవతలు; అహిపుడు = నాగాధిపతి; ఊర్ణనాభము = సాలెపురుగు.

**సంధులు :**

| | | | | |
|---|---|---|---|---|
| 1. కక్ష్యాంతరంబులు | - | కక్ష్య + అంతరంబులు | = | సవర్ణదీర్ఘసంధి |
| 2. ఆద్యంతము | - | ఆది + అంతము | = | యణాదేశ సంధి |
| 3. మజ్జనము | - | మత్ + జనము | = | జశ్త్వ సంధి |
| 4. తన్మయము | - | తత్ + మయము | = | అనునాసిక సంధి |
| 5. తపోవిభవంబు | - | తపః + విభవంబు | = | విసర్గ సంధి |
| 6. కెంగేలు | - | కెంపు + కేలు | = | (ప్రాతాది, నుగాగమ, సరళాదేశ సంధులు |

1. సమాసమంబుల బ్రాతాదుల దొలియచ్చుమీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు - ఉదా : కె + కేలు

2. లుప్త శేషంబునకుంబరుషములు పరములగునపుడు నుగాగమంబగు
ఉదా : కె + ను + కేలు

3. ద్రుత ప్రకృతికముల మీది పరుషములకు సరళములగు
ఉదా : కె + న్ + గేలు

4. ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషనగు.
ఉదా : కెంగేలు.

**సమాసములు :**

లలాటాక్షుడు - లలాటమునందు అక్షముకలవాడు - బహుద్రీహి ; అధమ బుద్ధి - అధమమైన బుద్ధి - విశేషణ పూర్వపద కర్మధారయం ; అమృతము - మృతము కానిది - నఞ్ తత్పురుష సమాసము ; సురమునీశ్వరమానవదానవులు - సురలును, మునీశ్వరులును, మానవులును, దానవులును - బహు పద ద్వంద్వ సమాసము ; కెంగేలు - కెంపువంటికేలు - ఉపమాన పూర్వపదకర్మధారయము ;

**ప్రకృతి - వికృతులు :**

గృహము - గేహము, గీము; అంతఃపురము - అంతియపురము; ఛాయ - చాయ; క్షేమము - సేమము.

**పర్యాయ పదములు :**

1. ఊర్ణనాభము : అభిలూత, చెలది, చెలగము, మర్కటము, శలకము, జాలిక, తంతునాభము, వైనాశికము.
2. శివుడు : ముక్కంటి, ప్రథమపతి, లాటాక్షుడు, దక్షిణామూర్తి, శంకరుడు, భవుడు.

**నానార్థములు :**

1. పుండరీకము : తెల్లదామర, తెల్లగొడుగు, తీర్థ విశేషము, పెద్దపులి, తియ్యమామిడి.

2. అక్షము : ఇంద్రియము, బండికన్ను, రుద్రాక్షము, ఒక సంవత్సరము.

3. శ్రుతులు : వేదములు, చెవులు, వినికిడులు, సుద్దులు.

**వ్యుత్పత్త్యర్థములు :**

1. అనిమిషులు - రెప్పపాటులేనివారు (దేవతలు)
2. దానవులు - దనుజవంశములో జన్మించినవారు (రాక్షసులు)
3. వాతాశనము - వాయువును భక్షించునది (పాము)
4. శంకరుడు - శుభములను కలుగజేయువాడు (శివుడు)
5. క్షితిధరము - భూమిని ధరించునది (కొండ)

**విశేషాంశములు :**

1. మర్కట కీటకము : తననాభినుండి వచ్చెడు నూలు ఆధారముగా మర్కటము వలె ఎక్కునది.

2. ధ్రువమండలము : నక్షత్ర సమూహము. పూర్వజన్మలో బ్రాహ్మణుడగు ధ్రువుడు రాజ్యమునేలవలెనను కోరిక కలిగి, తరువాతి జన్మమున క్షత్రియుడైపుట్టి రాజ్యమేలెను. విష్ణు దూతలు వచ్చి విమానారూఢుని గావించి తీసుకొని వెళ్ళిరి. విమానమెక్కబోవునపుడు తల్లికై చూడగా, ఇతని తలంపెరింగి ఈతని ముందర పోవుచున్న తల్లిని చూపిరి. ఇతడు విష్ణువర ప్రభావమున ఆకాశమున నక్షత్రమై ప్రకాశించుచుండెను.

3. యుగములు : కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అని నాలుగు. ఈ నాలుగింటిలో కృతయుగము మొదటిది. కృతయుగకాలము - 17,20,000 సంవత్సరములు.

**అర్థ సందర్భములను వివరింపుము :**

1. నిలయములు గట్టె నత్యంత నిష్ఠతోడ.
2. నీవేయర్థము నన్ను వేడెదవు? దానింజెప్పుమా?

3. నాతపమింతట ఫలియించె.

4. ఆ కైవల్యమె యభీష్టమని ప్రార్థింపన్.

**ప్రశ్నలు :**

1. శివుని కొరకై సాలెపురుగు నిర్మించిన గృహ సౌందర్యమును వర్ణించుము?
2. శివుడు సాలెపురుగు భక్తిని పరీక్షించిన విధమెట్టిది?
3. సాలెపురుగు అగ్నిలో దూకుటకు గల కారణమేమి?
4. సాలెపురుగు శివైక్యము పొందిన విధమును వివరించుము?

***విద్యార్థులకు సూచన :***

పద్యములను భావయుక్తంగా చదువుటను నేర్చుకోవాలి.

**ఉపాధ్యాయులకు సూచన :**

శివైక్యము నొందిన ఇతర భక్తులను గూర్చి వివరింపుము.

## వ్యాకరణము

**ఛందస్సు :**

పద్యలక్షణమును వివరించునది ఛందస్సు

ఛందస్సు గణముల తోడను, గణములు గురు లఘువుల తోడను ఏర్పడును.

గురువు (గ) - గుర్తు U - (రెండు మాత్రలు)

లఘువు (ల) - గుర్తు I - (ఒక మాత్ర)

**గురువులు :**

1. దీర్ఘాక్షరములు - ఆ, కా,శ్రీ 2. వక్రతమాక్షరములు - ఐ, ఔ, రై, పౌ 3. సున్న, విసర్గతో గూడినవి - అం, కం, మః 4. పొల్లు హల్లునకు ముందుండునవి -కిన్, నన్ 5. సంయుక్తాక్షరములకు ముందుగలవి - భక్తి, కర్త 6. ద్విత్వాక్షరములకు ముందుగలవి - నాన్న, అక్క

**లఘువులు :**

హ్రస్వాక్షరములు - క, చ, మ

2. దీర్ఘాలు కాని ద్విత్వాక్షరములు, సంయుక్తాక్షరములు - క్క-గ్గ-క్య-గ్ర.

3. తేల్చి పలుకబడే రేఫతో కూడిన అక్షరములు - అద్రుచు - విద్రుచు.

4. అర సున్నతో కూడినవి, వట్రు సుడితో కూడిన అక్షరములు.

**1. గణములు :**

1. గురులఘువుల భేదముచే ఏకాక్షర (ఒక అక్షర) గణములు రెండు రకములు అది గురువైనను, లఘువైనను కావచ్చును.

**2. ద్వ్యక్షర గణములు** (రెండక్షర గణములు) :

రెండక్షర గణములనే ద్వ్యక్షర గణములందురు. ఇది గురు లఘువుల భేదముచే నాలుగు రకములగును.

| | | |
|---|---|---|
| 1. గగము - U U - ఉదా : | U U<br>రా మా | |
| 2. లలము - II - ఉదా : | I I<br>ర మ | |
| 3. గలము లేక హగణము - UI - ఉదా : | | U I<br>వం ట |
| 4. లగము - IU - ఉదా : | I U<br>ర మా | |

**3. త్ర్యక్షరగణములు :**

ఇవి మూడక్షర గణములగును. గురు లఘువుల భేదముచే ఎనిమిది రకములగును.

| | |
|---|---|
| 1. మగణము - UUU (త్రిగురువు) ఉదా : | U U U<br>శ్రీ రా మా |
| 2. భగణము - UII (ఆదిగురువు) ఉదా : | U I I<br>శ్రీ ప తి |
| 3. జగణము - IUI (మధ్య గురువు) ఉదా : | I U I<br>మ హే శ |

I I U
4. సగణము - IIU (అంత్య గురువు) ఉదా : గి రి జా

I I I
5. నగణము - III (త్రి లఘువు) ఉదా : పు రు ష

I U U
6. యగణము - IUU (ఆది లఘువు) ఉదా : పి నా కీ

U I U
7. రగణము - UIU (మధ్య లఘువు) ఉదా : ద్రౌ ప దీ

U U I
8. తగణము- UUI (అంత్య లఘువు) ఉదా : సా రం గి

**యతి లక్షణము :**

తెలుగు భాషయందు పద్యపాదము మొదటి అక్షరము యతి, ఆ పద్యనియమము ననుసరించి యుండవలసిన అక్షరమున కది సజాతి అక్షరముగా నుండవలెను. యతి నియమించిన స్థానమునకు యతిస్థానమని పేరు. యతి స్థానమున సంధి జరిగినచో మొదటి అచ్చునకు అదే జాతి అచ్చు చెల్లవలెను.

గురు లఘువులకు గణ విభజన సూత్రము.

I U U U I U I I I U
యమాతాభాజ రానస లగం

**ప్రాస లక్షణము :**

పద్యపాదమునందు రెండవ అక్షరము ప్రాసయగును. ఆ ప్రాస అక్షరము ఏ అచ్చుతోనైన కలిసియుండవచ్చును. జాతులకు, వృత్తములకు ప్రాసనియమముండును. ఉపజాతులకు ప్రాసనియమము లేదు. ప్రాసయతి చెల్లును.

1. ప్రాసాక్షరము బిందు పూర్వకమైనచో అన్నియు అట్లే యుండవలెను.

2. ప్రాసాక్షరము సంయుక్తము, ద్విత్వమైనచో అన్నియు అట్లే యుండవలెను.

3. హ్రస్వాక్షరమైనచో ఆ గుణితములోని ఏ హ్రస్వాక్షరమైనను ప్రాసగా చెల్లును. దీర్ఘమైనచో అన్ని పాదములట్లే యుండవలయును.